## <u>25వ వారము - సభ్యుల విభాగము</u>

## <u>నామామృతం</u>

జనులు ఈ యుగములో సంకీర్తనతో కరువు కాటకాల నుండి ముక్తి పొందగలరు.

హరే కృష్ణ మంత్రాన్ని చాలా మంది జనులు కలిసి కీర్తన చేస్తే దానిని “సంకీర్తన” అంటారు. ఇటువంటి యజ్ఞము ద్వారా ఆకాశంలో మేఘాలు కమ్ముతాయి. (యజ్ఞాత్ భవతీ పర్జన్యః) కరువుగా ఉంటున్న ఈ రోజులలో ఈ హరే కృష్ణ యజ్ఞం అనే పద్ధతి ద్వారా జనులు కరువులు నుండి సులభంగా విముక్తి పొందవచ్చు. ఈ యజ్ఞము మొత్తం మానవ జాతికే ముక్తినిస్తుంది. ప్రస్తుతం యూరప్, అమెరికా దేశాలంతటా కరువుగా ఉంది. జనులు అవస్థ పడుతున్నారు. కానీ ఈ కృష్ణ చైతన్య ఉద్యమాన్ని జనులు దృఢంగా పాటిస్తే పాప కర్మలు మానేసి హరే కృష్ణ మహా మంత్రం జపిస్తే వారి కష్టాలన్నీ సులభంగా తీరిపోతాయి.

***శ్రీమద్భాగవతము 9:1-17***

## <u>చర్చ - విషయ విభాగము</u>

## <u>*ఆధ్యాత్మిక విద్య*</u>

*త్రిగుణ మయైర్భావైరేభిః సర్వ మిదం జగత్*
*మోహితం నాభిజానాతి మా మేభ్యః పరమవ్యయం*

“సమస్త విశ్వము సత్వ, రజ, తమో గుణములనెడి త్రిగుణములచే భ్రాంతికి గురియై గుణములకు పరుడను మరియు అవ్యయుడను అగు నన్ను ఎరుగజాలకున్నది.”

సమస్త ప్రపంచము త్రిగుణములచే మోహింపజేయబడియున్నది. అట్టి త్రిగుణములచే మోహనముకు గురియైన వారు శ్రీ కృష్ణ భగవానుడు ప్రకృతికి పరమైన వాడని ఎరుగజాలరు.

భౌతిక ప్రకృతి ప్రభావము నందున్న ప్రతి జీవియు ఒక ప్రత్యేకమైన దేహమును మరియు తత్సంబంధిత కర్మలను కలిగియుండును. గుణముల ననుసరించి కర్మల యందు చరించు మనుజులు నాలుగు రకములుగా నుందురు. సత్త్వగుణమునందు సంపూర్ణముగా నిలచియుండువారు బ్రాహ్మణులు. రజోగుణమునందు సంపూర్ణముగా నిలచియుండువారు క్షత్రియులు. రజస్తమోగుణములను కలిగియుండువారు వైశ్యులు. కేవలము తమోగుణము నందే యుడువారు శూద్రులు. శూద్రులకన్నను నీచులైనవారు జంతువులు లేక పశుప్రాయ జీవనులు అనబడుదురు. కాని వాస్తవమునకు ఈ ఉపాధులన్నియును అశాశ్వతములు. బ్రాహ్మణుడైనను, క్షత్రియుడైనను, వైశ్యుడైనను, శూద్రుడైనను లేక ఇంకేదైనను ఈ జీవితము తాత్కాలికమైనది. ఈ

జీవితము తాత్కాలికమైనను దీని పిదప మనకు ఏ జన్మ లభించునో ఎరుగలేము. మయావశమున దేహభావనకు లోబడియై మనలను మనము భారతీయులుగనో, అమెరికా వాసులగనో లేక బ్రాహ్మణులుగనో, హిందువులుగనో, మహ్మదీయులుగనో భావించుచుందుము. ఈ విధముగా త్రిగుణములచే బంధింతులమైనచో మనము ఆ గుణముల వెనుకనున్న భగవానుని మరతుము. కనుకనే త్రిగుణములచే మోహమునొందిన జీవులు భౌతిక నేపథ్యము వెనుకనున్నది తానేయనుచు ఎరుగజాలకున్నారని శ్రీ కృష్ణ భగవానుడు పలుకుచున్నాడు.

మానవులు, దేవతలు, జంతువులాదిగాగల అనేకరకముల జీవులు ప్రకృతి ప్రభావము చేతనే నిర్గుణుడైన శ్రీకృష్ణ భగవానుని మరచియున్నారు. రజస్తమోగుణముల యందున్నవారే గాక, సత్త్వగుణమునందున్న వారు కూడా పరతత్త్వము యొక్క నిరాకారబ్రహ్మభావమును దాటి ముందుకు పోజాలరు. సౌందర్యము, ఐశ్వర్యము, జ్ఞానము, బలము, యశస్సు, వైరాగ్యము సమగ్రముగా నున్న శ్రీకృష్ణ భగవానుని దివ్యరూపముచే వారు భ్రాంతి నొందుదురు. శ్రీకృష్ణ భగవానుని అవగతము చేసికొనుట సత్త్వగుణమునందున్న వారికే సాధ్యము కాదన్నచో, రజస్తమోగుణములందున్న వారికి ఏమీ ఆశ మిగిలి యుండగలదు? కాని కృష్ణ భక్తిరసభావనము ఈ త్రిగుణములకు పరమైనట్టిది. దానియందు ప్రతిష్ఠితులైనట్టి వారు నిజముగా ముక్త పురుషులు.

**కనుగొనండి :**

1. ప్రకృతియొక్క మూడు గుణాలను తెలపండి? ఏ గుణము ఏ రకమైన మనుషులలో అత్యధికంగా కనబడుతుందో తెలపండి?

**అవగాహన ప్రశ్నలు :**

1. దేహమునకు సంబంధించిన బిరుదులు (Designations) ఎందుకు ముఖ్యము కావు? అవి దేనిని మరిపింపచేస్తాయి?
2. సత్వగుణములో ఉన్నవారు పరమ సత్యమును ఏవిధముగా అవగాహన చేసుకోగలరు?

**అనువర్తనము ప్రశ్నలు :**

1. మీరు ఈ త్రిగుణములకి అతీతంగా ఎదిగి ముక్తి చెందాలనుకుంటున్నారా? కృష్ణ చైతన్యములో దివ్య భావముతో ఉండడం వలన ప్రయోజనమేమిటి చర్చించండి?

# ప్రచారమే సర్వసారము

పూజ్యనీయులు ఏ.సి. భక్తివేదాంత స్వామి ప్రభుపాదుల వారు.

చైతన్య మహాప్రభువు ఆదేశానికి వ్యతిరేకంగా కొంతమంది ఆయన అనుచరులు అనుకునే వారు ప్రచారము చెయ్యరు. 500 ఏళ్ల క్రితం నవద్వీపంలో ఆవిష్కరింపబడిన మానవాళికి ఉపయోగకరమైన ఈ సంకీర్తన యజ్ఞము మొత్తం ప్రపంచమంతటా వ్యాపించాలని శ్రీ చైతన్య మహాప్రభువు కోరిక. దురదృష్టవశాత్తు చాలామంది చైతన్య మహప్రభువు అనుచరులు అనే పేరుతో గుడులు స్థాపించి, విగ్రహాలను దర్శింపచేసి, డబ్బులు వసూలు చేసుకుని దానిని తినడానికి, పడుకోడానికి వాడుతూ తృప్తి చెందుతున్నారు. వారు శ్రీ చైతన్య మహాప్రభువు ఉద్యమాన్ని ప్రచారము చేయకపోగా చేసే వారిని చూసి అసూయ చెందుతారు. ఇటువంటి దుస్థితిలో ఉన్న అనుచరులు దేశం బయటకు వచ్చి అంతటా ప్రచారం చెయ్యాలి. అదే చైతన్య మహాప్రభువు కోరిక. చైతన్య మహాప్రభువు అనుచరులు ఆయన తలంపుని మనసా, వాచా పాటించాలి. అలా పాటిస్తున్నప్పడు చెట్ల కంటే ఎక్కువ ఓర్పుతో, గడ్డిపోచ కంటే వినయంతో ఉండాలి.